

చింతలపాలెం మండలం బుగ్గమాధవరంలో ఎమ్మెల్యే సైదిరెడ్డి ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో కోదాడ ఎమ్మెల్యే బొల్లం

## బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే మీకు మీరు వేసుకున్నట్టే

- కాంగ్రెస్, బీజేపీతోనే తెలంగాణకు దోహ్రం
- కుంటి, ముసలి గుర్రాలతో ఉపయోగం లేదు
- విద్యుత్తు శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి
- సూర్యాపేట జిల్లాలో ఎన్నికల ప్రచారం ప్రారంభం

నేరేడుచర్ల, అక్టోబర్ 6: 'బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేస్తే మీకు మీరు వేసుకున్నట్లేనని, మనం వేసే ఓటుతో మన తలరాత మారుతుంది' అని విద్యుత్తు శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. దశాబ్దాలుగా ఉమ్మడి నల్లగొండను జిల్లాను నాశనం చేసిన కుంటి, ముసలి గుర్రాలతో ఉపయోగం లేదని, సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే రాష్ట్రం అభివృద్ధి స్పష్టం చేశారు. అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గం చింతపాలెం మండలం బుగ్గమాధవరంలో ఎమ్మె ల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. రామచంద్రస్వామి ఆలయంలో పూజలు చేసి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. 60 ఏండ్లలో కాంగ్రెస్ పార్టీ చేయని అభివృద్ధిని తొమ్మిదేండ్లలోనే సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు చేసి చూపించారని చెప్పారు. 2019లో సైదిరెడ్డికి వేసిన ఓటు రూ.3,500 కోట్లతో అభివృద్ధి పనులు చేసిందని, నాలుగేండ్లలో ఇన్ని నిధులు తేవడం ఓ రికార్డు అని పేర్కొన్నారు. సైదిరెడ్డి రాకముందు రోడ్లు ఎలా ఉన్నాయో? ఇప్పుడు ఎలా ఉన్నా యో ప్రజలు బేరీజు వేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పాలనలో సాగర్ ఎడమ కాల్వ సాగు నీటి విషయంలో ఆంధ్రా పాలకులు అన్యాయం చేస్తున్నా ఆ పార్టీ నేతలు అడ్డుకోవడంలో విఫలమయ్యారని మండిపడ్డారు. సాగర్ ఆయకట్టు చరిత్రలో వరుసగా 16 పంటలకు నీళ్లు ఇచ్చిన ఘనత బీఆర్‌ఎస్ పార్టీదేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులతో కలిసి సెల్ఫీ దిగుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## రెండు కోట్ల ఉద్యోగాలు ఎక్కడ మోదీ?

- కులం, మతం పేరిట యువతను రెచ్చగొట్టేందుకు కుట్రలు
- ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- జేఎన్టీయూ కళాశాల మంజూరుపై విద్యార్థుల కృతజ్ఞత ర్యాలీ

పాలమూరు, అక్టోబర్ 6 : దేశవ్యాప్తంగా నిరుద్యోగులకు ఉపాధి కల్పనలో ప్రధాని నరేంద్ర మోదీ విఫలమయ్యారని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామంటూ 2014 ఎన్నికలకు ముందు ప్రకటించారని, ఆ హామీ ఏమైందని ప్రశ్నించారు. మహబూబ్‌నగర్‌కు జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేసినందుకు సీఎం కేసీఆర్, మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపేందుకు శుక్రవారం బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుదీప్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. మెట్టుగడ్డ నుంచి ప్రారంభమైన ర్యాలీలో సుమారు పదివేల మందికిపైగా విద్యార్థులు ర్యాలీ తెలంగాణ చౌరస్తా వరకు నిర్వహించగా ఈ సందర్భంగా థ్యాంకూ సీఎం సార్, థ్యాంకూ శీనన్న అన్న నినాదాలు మార్మోగాయి. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఉద్యోగాల కల్పనలో విఫలమైన బీజేపీ నాయకులు కులం, మతం పేరిట యువతను రెచ్చగొట్టి ఓట్లు కొల్లగొట్టేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. పొరపాటున కూడా యువత వారి మాయలో పడొద్దని సూచించారు. బీఆర్‌ఎస్ సర్కార్ ఆపిల్ లాంటి ప్రఖ్యాత కంపెనీలను తెలంగాణకు తీసుకువచ్చి రాష్ట్ర యువతకు లక్షల సంఖ్యలో ఉద్యోగాలను కల్పిస్తున్నట్టు చెప్పారు. మహబూబ్‌నగర్ లాంటి ద్వితీయ శ్రేణి నగరాల్లోకూ ఐటీ కంపెనీలను తీసుకువచ్చి స్థానిక యువతకు ఉద్యోగాలను అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. అనంతరం సీఎం కేసీఆర్, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చిత్రపటాలకు విద్యార్థులు క్షీరాభిషేకం చేశారు.



శుక్రవారం బాన్సువాడలో స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డిని నాగలితో సన్మానిస్తున్న మున్నూరుకాపు కులస్థులు

## ఉత్తుత్తి హామీలతో వస్తున్న వారితో జాగ్రత్త

- సుపరిపాలన అందించే ప్రభుత్వాన్ని ఆదరించాలి
- అభివృద్ధి పనులు శాశ్వతం.. నేను శాశ్వతం కాదు
- సభాపతి పోచారం

బాన్సువాడ/బాన్సువాడ రూరల్, అక్టోబర్ 6: ఎన్నికల వేళ కల్లబొల్లి మాటలు, ఉత్తుత్తి హామీలతో ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్న పార్టీల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి సూచించారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలోని జక్కల్‌దాని తండాలో పలు అభివృద్ధి కార్యక్రమాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో తాను చేసిన అభివృద్ధి పనులు శాశ్వతంగా ఉంటాయని, కానీ తాను శాశ్వతంగా ఉండనని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం తండాలను పంచాయతీలుగా మార్చడంతో గిరిజన తండాల రూపురేఖలు మారిపోయాయని అన్నారు. అనంతరం బాన్సువాడలోని పీఆర్ గార్డెన్‌లో మున్నూరుకాపులు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యారు. ఈ సందర్భగా పోచారం మాట్లాడుతూ మున్నూరు కాపులను కడుపులో పెట్టుకొని కాపాడుకుంటామని తెలిపారు. కాపు బిడ్డకు కాలికి ముల్లు గుచ్చుకుంటే తన పంటితో తీస్తానని అన్నారు. ముచ్చటగా మూడోసారి కేసీఆర్ సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. అందరి ఆశీర్వాదంతో తాను మళ్లీ బాన్సువాడ ఎమ్మెల్యేగా ఉంటానని పేర్కొన్నారు.




కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లో మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న మంత్రి గంగుల. చిత్రంలో జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ

## ఢిల్లీ పాలకుల చేతుల్లో పెడితే మళ్లీ ఆంధ్రాలో కలిపేస్తరు

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్ కార్పొరేషన్, అక్టోబర్ 6 : ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయమాటలు నమ్మి అధికారాన్ని ఢిల్లీ నాయకులకు అప్పగిస్తే పచ్చగా ఉన్న తెలంగాణను మళ్లీ ఆంధ్రాలో కలిపేస్తారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో శుక్రవారం పలు డివిజన్లలో వివిధ అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. అనంతరం బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఆయాచోట్ల మంత్రి మాట్లాడుతూ గతంలో తెలంగాణ సంపాదన ఆంధ్రా పాలకులు దోచుకున్నారే తప్ప.. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచన వారికి రాలేదని విమర్శించారు. పచ్చని తెలంగాణను దోచుకునేందుకు ఢిల్లీ పాలకులు మళ్లీ హైదరాబాద్‌లో పాగా వేస్తున్నారని హెచ్చరించారు. తెలంగాణను తిరిగి ఆంధ్రాలో కలిపేందుకు బీజేపీ ముసుగులో మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ ముసుగులో కేవీపీ, షర్మిల తెలంగాణలోకి వస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారంతా కేసీఆర్‌ను ఓడగొట్టి తెలంగాణను దోచుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని, అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ చేతిలోనే తెలంగాణ క్షేమంగా ఉంటుందని, ఢిల్లీ పాలకుల చేతుల్లోకి వెళ్తే మళ్లీ గుడ్డిదీపం అవుతుందని హెచ్చరించారు.



అసెంబ్లీ ఎన్నికల తరువాతే సింగరేణి ఎన్నికలు నిర్వహించాలని మీడియాకు తెలియజేస్తున్న 12 కార్మిక సంఘాల ప్రతినిధులు

## సింగరేణిలో గుర్తింపు ఎన్నికలు ఇప్పుడొద్దు

- అసెంబ్లీ ఎన్నికల తర్వాతే నిర్వహించాలి
- 12 కార్మిక సంఘాల మూకుమ్మడి తీర్మానం

కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 6 : సింగరేణిలో క్షేత్రస్థాయిలో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అసెంబ్లీ ఎన్నికల తర్వాతే సింగరేణి గుర్తింపు ఎన్నికలను నిర్వహించాలని 12 కార్మిక సంఘాలు మూకుమ్మడిగా నిర్ణయించాయి. తమ అభిప్రాయం తెలుసుకోకుండానే తమ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకోకుండానే ఏకపక్షంగా కేంద్ర కార్మికశాఖ అధికారి గత నెల 27న ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారని, దీన్ని అప్పుడే తీవ్రంగా ఖండించామని శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పేర్కొన్నారు. డిప్యూటీ సీఎల్సీ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సింగరేణి ఓటర్ల జాబితా తమకు అందిందా లేదా అన్నది తెలుసుకోకుండానే తమ అభిప్రాయాలకు గౌరవం ఇవ్వకుండానే రాత్రికి రాత్రే ఈమెయిల్ ద్వారా నామినేషన్ల స్వీకరణ తేదీలను ప్రకటించడంలో పెద్ద కుట్ర దాగి ఉన్నదని వారు ఆరోపించారు. ఎన్నికల వాయిదాను కోరుతున్న తాము నామినేషన్లు వేయకపోతే కొందరు కుట్ర పన్నినట్టుగా వారు కోరుకున్న వారిని గెలిపించాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కుట్ర చేసిన వారికి బుద్ధి చెప్పేందుకు ఎన్నికలను వ్యతిరేకిస్తున్నప్పటికీ నామినేషన్లను దాఖలు చేయడానికి మూకుమ్మడిగా నిర్ణయించుకున్నామని, అలాగే ఓటర్ల జాబితాను ఇవ్వకుండా నామినేషన్ల తేదీని ప్రకటించిన కార్మికశాఖ అధికారులపై న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు. ఇప్పటికైనా ఎన్నికలను రీ షెడ్యూల్ చేయాలని కార్మిక సంఘాల అభిప్రాయాలకు విలువ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల నామినేషన్ల ప్రకటన వచ్చినప్పటికీ ఎన్నికల వాయిదా కోసం ఐక్యంగా పోరాటం చేసి, విజయం సాధిస్తామని హైదరాబాద్‌లో కార్మిక సంఘాలకు చెందిన నేతలు ప్రకటించారు.

## సింగరేణిలో డిస్మిస్ కార్మికులకు ఉద్యోగాలు

- ప్రారంభమైన దరఖాస్తుల ప్రక్రియ
- ఫలించిన ఎమ్మెల్యే గండ్ర కృషి

జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 6(నమస్తే తెలంగాణ): సింగరేణి కాలరీస్ కంపెనీలో గైర్హాజరు కారణంగా డిస్మిస్‌కు గురైన కార్మికులు తిరిగి ఉద్యోగాల్లో చేరనున్నారు. సింగరేణివ్యాప్తంగా సుమారు 180 మంది కార్మికులు 2019 నుంచి 2022 డిసెంబర్ 31 మధ్యకాలంలో విధులకు తరచూ గైర్హాజరు కావడంతో యాజమాన్యం డిస్మిస్ చేసింది. ఇందులో భూపాలపల్లి ఏరియా నుంచి 46 మంది ఉండగా వీరిలో ఇద్దరు అనారోగ్యంతో మృతిచెందారు. డిస్మిస్ కార్మికులకు ఒక అవకాశం కల్పించి తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవాలని టీబీజీకేఎస్ నాయకులు, డిస్మిస్ కార్మికులు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి విన్నవించుకున్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే గండ్ర పలుమార్లు సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ, టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కవిత దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కేసీఆర్ డిస్మిస్ కార్మికులను విధుల్లోకి తీసుకునేందుకు అంగీకరించారు. ఈ మేరకు సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేయడంతో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 31లోగా దరఖాస్తులు చేసుకోవాలని జీఎం (పర్సనల్) హనుమంతరావు కోరారు.



అక్కపెల్లి చెరువు ఎత్తిపోతల పథకానికి ధర్మపురిలోని గోదావరి వద్ద శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొప్పుల. చిత్రంలో పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేతకాని

## దశాబ్దాల కరువుకు చరమగీతం

- సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమైంది
- ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి కొప్పుల

ధర్మపురి, అక్టోబర్ 6: సీఎం కేసీఆర్ ఆలోచన, కృషి ఫలితంగానే తెలంగాణలో దశాబ్దాల కరువుకు చరమగీతం పాడగలిగామని ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురి వద్ద గోదావరి ఆధారంగా అక్కపెల్లి చెరువు నింపేందుకు రూ.60.80 కోట్లతో ఎత్తిపోతల నిర్మాణానికి పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేతకానితో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఒకప్పుడు భూగర్భ జలాలు అడుగంటి పోయేవని, తెలంగాణ ఆవిర్భావం తర్వాత సీఎం కేసీఆర్ కృషి వల్ల కరువు నేలల్లో జలసిరులు కురుస్తున్నాయని తెలిపారు. ప్రధానంగా వ్యవసాయ రంగంపై దృష్టిపెట్టడం, నీటి సంరక్షణ కోసం చేసిన చర్యలు ఫలించడంతో గతంలో కంటే పరిస్థితులు మెరుగుపడ్డాయని పేర్కొన్నారు. మిషన్ కాకతీయతో చెరువులకు పూర్వ వైభవం తీసుకురావడం, ప్రాజెక్టులు నిర్మించుకోవడం.. వంటి చర్యలు భూగర్భ జలాలు పెరగడానికి కారణమైనట్టు చెప్పారు. పాలకుల్లో చిత్తశుద్ధి ఉంటే ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ప్రజలకు అనుకూలంగా మార్చవచ్చని సీఎం కేసీఆర్ నిరూపించినట్టు తెలిపారు.






కుటుంబసభ్యులతో లక్ష్మణ్ (సర్కిల్‌లో)

## బతికొస్తవనుకోలేదు కొడుకా!

- 17 ఏండ్ల తర్వాత దుబాయ్ జైలు నుంచి విముక్తి
- 15 లక్షలు చెల్లించి విడిపించిన ఐటీ శాఖ మంత్రి కేటీఆర్
- స్వగ్రామానికి చేరిన లక్ష్మణ్
- కుటుంబ సభ్యుల భావోద్వేగం

కోనరావుపేట, అక్టోబర్ 6: ఉపాధి వేటలో దుబా య్ బాట పట్టిన యువకుడు ఓ హత్య కేసులో చిక్కుకొని 17 ఏండ్లు జైలు శిక్ష అనుభవించాడు. మంత్రి కేటీఆర్ చొరవతో ఎట్టకేలకు ఇంటికి చేరాడు. కొడుకును చూసి కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు. 'బతికొస్తవనుకోలేదు కొడుకా.. నీ పాణం ఎట్లున్నది బిడ్డా' అంటూ తల్లి కన్నీళ్లపర్యంతమైంది. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేటకు చెందిన దండుగుల నర్సయ్య, లస్మవ్వ దంపతులకు కొడుకు లక్ష్మణ్ ఉపాధి కోసం 2004లో దుబాయ్ వెళ్లాడు. అక్కడ నేపాల్‌కు చెందిన ఓ సెక్యూరిటీ గార్డు హత్య కేసులో ఇరుక్కుపోయి జైలుకు వెళ్లాడు. ఇతడితోపాటు సిరిసిల్ల మండలం పెద్దూరుకు చెందిన శివరాత్రి రవి, శివరాత్రి మల్లేశ్, శివరాత్రి హనుమంతు, గొల్లె నాంపెల్లి మరో నలుగురు శిక్ష అనుభవిస్తున్నారు. గతంలో మంత్రి కేటీఆర్ దుబాయ్ పర్యటనకు వెళ్లినప్పుడు బాధితుల క్షమాభిక్ష కోసం షరియా చట్టం ప్రకారం రూ.15 లక్షలు చెల్లించారు. నేర తీవ్రత దృష్ట్యా అక్కడి అధికారులు వీరిని విడుదల చేయలేదు. ఇటీవల మంత్రి కేటీఆర్ స్వయంగా దుబాయ్ వెళ్లి అక్కడి అధికారులు, ప్రభుత్వంతో మాట్లాడారు. ఇందులో కోనరావుపేటకు చెందిన లక్ష్మణ్ అనారోగ్యంతోపాటు తదితర కారణాల రీత్యా న్యాయవాది అభ్యర్థన మేరకు విడుదలకు ఆమోదం తెలిపారు. దీంతో శుక్రవారం ఇండియన్ ఎంబసీ అధికారులు స్వయంగా హైదరాబాద్‌లో లక్ష్మణ్‌ను కుటుంబ సభ్యులకు అప్పగించారు. మానసిక సమస్యతో బాధపడుతున్న లక్ష్మణ్ సురక్షితంగా ఇంటికి చేరాడు. తల్లి లస్మవ్వను చూసి కంటతడిపెట్టాడు. మంత్రి కేటీఆర్ దేవుడిలా వచ్చి లక్ష్మణ్‌ను ఇంటికి చేర్చాడని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

